

**భక్తులకు ఇబ్బందులు రానివ్వం**
యాదాద్రిలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని ఈఓ పేర్కొన్నారు. - 10లో



**చెక్‌బుక్ మాయం**
చెక్‌బుక్ తస్కరించిన కేటుగాళ్లు ఆ చెక్కులపై ఆర్డీఓ సంతకాన్ని ఫోర్జరీ చేసి డబ్బులు కాజేశారు. - 10లో




**వాతావరణం**
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### పాలిసెట్ ఫలితాలు విడుదల

రామగిరి(నల్లగొండ) : పాలిసెట్ -2024 ఎంట్రన్స్ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. జిల్లాలో మొత్తం 3,842 విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా ఎంపీసీ విభాగంలో బాలురు 1588 మంది, బాలికలు 1280 మంది అర్హత సాధించారు. ఎం బైపీసీ విభాగంలో బాలురు 1540 మంది, బాలికలు 1268 మంది అర్హత సాధించారు.

### ఒకేరకం విత్తనాలు కొనొద్దు

నల్లగొండ అగ్రికల్చర్ : రైతులు ఒకేరకం పత్తివిత్తనాల కోసం డిమాండ్ చేయకుండా అన్ని రకాల బ్రాండెడ్ విత్తనాలను కొనుగోలు చేసి విత్తుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల బ్రాండెడ్ విత్తనాలు హైబ్రీడ్ బీటీ 2 రకాలేనని పేర్కొన్నారు. రైతులు ఎంఆర్‌పీ ధరకు మాత్రమే కొనుగోలు చేయాలని, తప్పకుండా రశీదు తీసుకుని సీజన్ ముగిసే వరకు భద్రపర్చుకోవాలని సూచించారు. విత్తనాలను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మితే వ్యవసాయ శాఖ అధికారులకు గానీ, 72888 00023 ఫోన్‌నంబర్‌కు గానీ ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

### సిలిండర్ల పంపిణీలో జాప్యంపై విచారణ



ఏజెన్సీ కార్యాలయంలో మాట్లాడుతున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

నల్లగొండ : నల్లగొండ పట్టణంలోని సాయిదుర్గ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో సిలిండర్ల సరఫరాలో జాప్యం వల్ల వినియోగదారులు ఇబ్బందులు పడుతుండడంతో సోమవారం డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు గ్యాస్ ఏజెన్సీలో విచారణ చేపట్టారు. ఏజెన్సీ పరిధిలో 26,350 మంది కనెక్షన్‌దారులు ఉన్నారని, రెండు రోజుల నుంచి నలుగురు గ్యాస్ డెలివరీ బాయ్స్ రాకపోవడంతో 1200 మంది గ్యాస్ డెలివరి ఆగిపోయిందని డీఎస్ఓ పేర్కొన్నారు. వెంటనే సిలిండర్లు సరఫరా చేయాలని ఏజెన్సీని ఆదేశించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే 73311 67934, 73311 67930, 73311 67933 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణం పాతబస్తీ హిందూపూర్‌లోని వాటర్ ట్యాంక్‌లో మృతదేహం లభ్యమైన ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కలుషిత నీటిని తాగిన ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు మంచినీటి సరఫరాను పరిశీలించాల్సిన ఎమ్మెల్యే ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని ఆరోపించారు.

### విచారణ అధికారిగా అదనపు కలెక్టర్

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ హిందూపూర్‌లో వాటర్ ట్యాంక్‌లో వ్యక్తి మృతదేహం లభించిన ఘటనపై విచారణ అధికారిగా నల్లగొండ స్థానికసంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్రను నియమించినట్లు కలెక్టర్ దాసరి హరిచందన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

**వాటర్ ట్యాంక్‌ను పరిశీలించిన ఎస్పీ**

వ్యక్తి మృతదేహం లభ్యమైన వాటర్ ట్యాంక్‌ను ఎస్పీ చందనాదీప్తి సోమవారం పరిశీలించారు. మున్సిపల్ సిబ్బంది, స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతుడు ట్యాంక్ పైకి ఎలా వెళ్లాడు.. అని సిబ్బందిని అడిగి ఆరా తీశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.



మృతదేహం లభ్యమైన ట్యాంక్‌ను పరిశీలించి వస్తున్న ఎస్పీ చందనా దీప్తి

# గెలుపు ఎవరిదో..!

## నేడు తేలనున్న ఎంపీ అభ్యర్థుల భవితవ్యం





కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన, సిద్ధమైన కౌంటింగ్ కేంద్రం

- ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం
- మొదట పోస్టల్ బ్యాలెట్, ఆ తర్వాత ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు
- 9 గంటలకు వెలువడనున్న మొదటి రౌండ్ ఫలితం
- మధ్యాహ్నం 2 గంటల తర్వాతే పూర్తి ఫలితం వెల్లడి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎంపీ ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందో మంగళవారం తేలనుంది. నల్లగొండ లోక్‌సభ స్థానానికి గత నెల 13న పోలింగ్ జరిగింది. ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ముందుగా మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గం, చివరలో దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. ఈ ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 టేబుళ్ల చొప్పున..**

నల్లగొండ పట్టణ సమీపంలోని దుప్పలపల్లి వేర్‌హౌసింగ్ గోదాముల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగనుంది. గత నెల 13వ తేదీన పోలింగ్ తర్వాత అక్కడే స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరిచారు. వాటికి మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. మంగళవారం జరగనున్న కౌంటింగ్‌కు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన ఆద్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను 24 టేబుళ్లపై లెక్కిస్తారు. ఈ పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించి ప్రత్యేక హాలులో లెక్కిస్తారు. తర్వాత ఈవీఎంలోని ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ సెంగ్మెంట్లు ఉన్నాయి. నల్లగొండ, దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఓట్ల లెక్కింపు 14 టేబుళ్లపై కొనసాగనుంది.

| నియోజకవర్గం | పోలింగ్ బూత్‌లు | రౌండ్లు |
|---|---|---|
| దేవరకొండ | 328 | 24 |
| మిర్యాలగూడ | 264 | 19 |
| నాగార్జునసాగర్ | 306 | 22 |
| హుజూర్‌నగర్ | 308 | 22 |
| కోదాడ | 296 | 22 |
| సూర్యాపేట | 271 | 20 |
| నల్లగొండ | 288 | 21 |

**9 గంటలకు మొదటి రౌండ్ ఫలితం**

మొదటి రౌండ్ ఫలితం ఉదయం 9 గంటలకు వెలువడే అవకాశం ఉంది. మొదటి రౌండ్ కాబట్టి గంట పట్టే అవకాశం ఉంది. మిగతా రౌండ్ల ప్రక్రియ అరగంటకోసారి పూర్తయ్యే అవకాశం ఉంది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉన్న పోలింగ్ స్టేషన్లను బట్టి ప్రతి రౌండులోని 14 పోలింగ్ స్టేషన్లలోని ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. అతి తక్కువ పోలింగ్ స్టేషన్లు (264) ఉన్న మిర్యాలగూడ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు 19 రౌండ్లలో పూర్తి కానుండగా, అత్యధికంగా పోలింగ్‌స్టేషన్లు ఉన్న దేవరకొండ నియోజకవర్గం (328) ఓట్ల లెక్కింపు 24 రౌండ్లలో చివరకు పూర్తి కానుంది. దాదాపు మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో దేవరకొండ ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. దాంతోనే తుది ఫలితాన్ని అధికారులు ప్రకటిస్తారు. కౌంటింగ్‌కు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. ఆయా రౌండ్ల వారీగా లెక్కింపు పూర్తి కాగానే 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొదటి రౌండు పూర్తి కాగానే ఫలితాన్ని మీడియాకు వెల్లడిస్తారు. అదే విధంగా అన్ని రౌండ్ల ఫలితాలను ప్రకటించే విధంగా అధికారులు ఏర్పాటు చేశారు.

## ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించాలి

నల్లగొండ : పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపును సజావుగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా పరిశీలకుడు మనోజ్ కుమార్ మాణిక్‌రావు సూర్యవంశి పేర్కొన్నారు. సోమవారం ఆయన నల్లగొండ సమీపంలోని దుప్పలపల్లి గోదాములో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఓట్ల లెక్కింపుకు సంబంధించిన వివరాలను రౌండ్ల వారిగా మీడియా, ప్రజలకు తెలిసే విధంగా ముఖ్యమైన ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ

# 'పట్టభద్రుల' కౌంటింగ్ రేపే

- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం
- రాత్రి 11 గంటల వరకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తి
- రెండు రోజులపైనే కొనసాగనున్న ఓట్ల లెక్కింపు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ బుధవారం ప్రారంభం కానుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి గత నెల 27న పోలింగ్ జరగగా.. ఓట్ల లెక్కింపు ఈ నెల 5న జరుగనుంది. నల్లగొండ సమీపంలోని దుప్పలపల్లి గోదాముల్లో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై రెండు రోజులకు పైగా కొనసాగే అవకాశం ఉంది. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 600 ప్రధాన పోలింగ్‌స్టేషన్లు, 5 అదనపు పోలింగ్ స్టేషన్ల పరిధిలో వచ్చిన ఓట్లను మూడు విడతల్లో లెక్కించేలా అవసరమైన సిబ్బందిని నియమించారు.

**96 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు**

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా సాగనుంది. 5వ తేదీ బుధవారం ఉదయం 8 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. నాలుగు హాళ్లలో 96 టేబుళ్లపై 3,36,013 ఓట్ల లెక్కింపు చేపడతారు. ఈ ఓట్లను బ్యాలెట్ బాక్సుల వారీగా తీసుకొచ్చి ఓపెన్ చేసి 25 ఓట్లను ఒక బండిల్‌గా కడతారు. ఒక డ్రమ్ములో వేసి అన్నికట్టలను కలుపుతారు. తద్వారా ఏ బూత్‌లో ఎవరికి ఓట్లు పడ్డాయనేది తెలియకుండా ఉంటుంది. ఈ బండిల్స్ కట్టే ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగే అవకాశం ఉంది. ఆ తర్వాత మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమై రాత్రి 11 గంటల వరకు పూర్తయ్యే అవకాశం ఉంది.

**సగం ఓట్లకు మించి వచ్చిన వారిదే గెలుపు**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో 3,36,013 ఓట్లు పోలయ్యాయి. ఈ పోలైన ఓట్లలో చెల్లని ఓట్లను తీసేసి, చెల్లిన ఓట్లు లెక్కిస్తారు. చెల్లిన ఓట్లను బట్టే ఎన్ని ఓట్లు వస్తే గెలుస్తారనేది టార్గెట్ నిర్ణయిస్తారు. ఉదాహరణకు చెల్లిన ఓట్లు వంద ఉంటే అందులో సగం 50 ఓట్లు కాగా, 51 ఓట్లు వచ్చిన అభ్యర్థిని గెలిచినట్లుగా ప్రకటిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో అలా రాకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు.

**ఎలిమినేషన్ ప్రక్రియ ఇలా..**

మొదటి ప్రాధాన్యత ఓట్ల ద్వారా.. పోటీ చేసిన అభ్యర్థుల్లో గెలుపు కోసం నిర్ణయించిన టార్గెట్ ఓట్లు ఎవరికీ రాకపోతే మొదటి ప్రాధాన్యత ఓట్లలో తక్కువగా ఓట్లు వచ్చిన చివరి అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తారు. ఎలిమినేట్ అయిన ఆ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఇచ్చిన ఓటర్లు, రెండో ప్రాధాన్యత ఏయే అభ్యర్థులకు ఇచ్చారో చూసి, ఆ ఓట్లను ఆయా అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యతలో వచ్చిన ఓట్లకు కలుపుతారు. అలా కలిపిన రెండో ప్రాధాన్యత ఓట్లతో టార్గెట్ వస్తే గెలిచినట్లు ప్రకటిస్తారు. ప్పటికీ గెలిచేందుకు ఓట్లు సరిపడా రాకపోతే తక్కువగా ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేట్ చేసుకుంటూ వెళ్తూ గెలుపు టార్గెట్ వచ్చేంత వరకు రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును కొనసాగిస్తారు.

**2800 మంది అధికారులు, సిబ్బంది**

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో 2800 మంది అధికారులు, సిబ్బంది పాల్గొననున్నారు. 1100 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లను, 37 మంది ఏఆర్‌ఓలు, 40 మంది తహసీల్దార్లను నియమించారు. అలాగే 12 జిల్లాల నుంచి మరో 300 మంది సిబ్బంది కూడా పాల్గొననున్నారు. హమాలీ, మున్సిపల్ సిబ్బంది మరో 300 మందిని కౌంటింగ్ కోసం ఉపయోగిస్తున్నారు. వెయ్యి మందికి పైగానే పోలీసు, ఫైర్, విద్యుత్ సిబ్బందిని నియమించారు. కౌంటింగ్ వద్ద 144 సెక్షన్ కొనసాగనుంది.



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

**షిఫ్ట్‌ల వారీగా విధులు : కలెక్టర్**

నల్లగొండ : శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక కౌంటింగ్‌లో సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరిచందన పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు ప్రక్రియపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. షిఫ్ట్‌ల వారీగా విధులు ఉన్న వారు గంట ముందుగానే రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. మొదటి రౌండ్ నుంచి చివరి రౌండు వరకు అప్రమత్తతతో, సహనంగా వ్యవహరించాలని కోరారు.

## కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు : ఎస్పీ

నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ జరిగే నల్లగొండ సమీపంలోని దుప్పలపల్లి గోదాము వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. సోమవారం కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దాదాపు 630 మంది అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు లెక్కింపునకు హాజరయ్యే అధికారులు సెల్‌ఫోన్లు, నిషేధిత వస్తువులైన అగ్గిపెట్టెలు, లైటర్, ఇంక్ బాటల్స్, లిక్విడ్, వాటర్ బాటిల్, పేలుడుకు కారణమయ్యే వస్తువులను లెక్కింపు కేంద్రాల్లోకి తీసుకురావద్దని సూచించారు. ఎన్నికల అధికారి జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు వెంట ఉంచుకొని తనిఖీలు చేసే పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం వద్ద జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని వీటీకాలనీలో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఎల్‌ఈడీ స్క్రీన్‌పై కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్ర అభివృద్ధి, అంతకు ముందు ఉన్న పరిస్థితులను వీక్షించారు. ఉద్యమకాలంలో జరిగిన సంఘటనలను ప్రదర్శించడంతో అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, ఎన్.భాస్కర్‌రావు, లింగయ్య, భగత్‌కుమార్, తిప్పన విజయసింహారెడ్డి, నిరంజన్‌వలి పాల్గొన్నారు.

# పత్తిసాగు షురూ..

- జిల్లా అంతటా కురిసిన వర్షం
- ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు
- భూమి పదునయ్యే వాన కురవడంతో విత్తనాలు వేసే పనిలో నిమగ్నం

నల్లగొండ టౌన్ : జిల్లాలో పతిసాగు పనులు మొదలయ్యాయి. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లా అంతటా విస్తారంగా వర్షం కురిసింది. సగటున 50.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అత్యధికంగా గుర్రంపోడు మండలంలో 115. 2, దేవరకొండ మండలంలో 103.8, కొండమల్లేపల్లిలో 102.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షంతో అన్ని మండలాల్లో భూములు పదునయ్యాయి. ఇప్పటికే చేలల్లో పత్తి కట్టెను తొలగించుకున్న రైతులు వారం పదిరోజులు క్రితం కురిసిన వర్షాలకు దుక్కులను దున్నుకుని సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుత మంచి వర్షం కురవడంతో పత్తి గింజలు విత్తుకునే పనులను ప్రారంభించారు.

**మొదలైన పనులు**

జిల్లాలో నేరడుగొమ్ము, చిట్యాల మండలాలు మినహా మిగతా మండలాల్లో మంచి పదునైన వర్షం కురిసింది. దీంతో సోమవారం ఉదయం జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు కాడెద్లను సిద్ధం చేసుకుని అచ్చు తోలుకోవడం కనిపించింది. ముఖ్యంగా గుర్రంపోడు, కొండమల్లేపల్లి, దేవరకొండ, కట్టంగూరు, మునుగోడు,, శాలిగౌరారం, నల్లగొండ, తిప్పర్తి, కనగల్, చండూరు, మర్రిగూడ, నాంపల్లి, చింతపల్లి, అనుముల, వేములపల్లి, దామరచర్ల, అడవిదేవులపల్లి, తిరుమలగిరిసాగర్, పెద్దవూర, పీఏపల్లి, చందంపేట ప్రాంతాల్లో రైతులు కూలీలను తీసుకెళ్లి పత్తి విత్తనాలను విత్తిస్తున్నారు.



కట్టంగూరులో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు



అచ్చుతోలుతున్న రైతు


**సాగు అంచనా 5.40లక్షల ఎకరాలు**

జిల్లాలో ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో సమురు 5.40లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. దీనికి అవసరమైన 15లక్షల పత్తి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచేందుకు జిల్లా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలో ఇప్పటి వరకు 5,52,279 వివిధ కంపెనీలకు చెందిన హైబ్రీడ్ రకాల పత్తి విత్తనాలను ఆయా కంపెనీలు అందుబాటులో ఉంచాయి. సీజన్ ఆరంభమవుతున్న నేపథ్యంలో రైతులు 1,63,780 పత్తి విత్తనాల ప్యాకెట్లు కొనుగోలు చేశారు.

# సాగులో సమూల మార్పులు

- విస్తీర్ణం, దిగుబడి గణనీయంగా పెరిగింది
- పెట్టుబడులు కూడా పెరగడంతో రైతుకు నష్టాలే వస్తున్నాయి
- ప్రభుత్వం మద్దతు ధరను శాస్త్రీయంగా నిర్ణయించాలి

'సాక్షి' ఇంటర్వ్యూలో ఉత్తమ రైతు అవార్డు గ్రహీత పల్‌రెడ్డి రాంరెడ్డి



మాట్లాడుతున్న పల్‌రెడ్డి రాంరెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్ : వ్యవసాయ రంగంలో సమూల మార్పు వచ్చింది. తెలంగాణ వచ్చాక జిల్లాలో నీటి వనరులు పెరగడంతో సాగు విస్తీర్ణం, దిగుబడి కూడా పెరిగింది. పంటలు అమ్ముకోవడం కూడా సులభతరమైంది. 24 గంటల విద్యుత్ సరఫరాతో నాన్ ఆయకట్టులో రైతులు బోరుబావుల ద్వారా సాగు చేపడుతున్నారు. యాంత్రీకరణ పెరగడంతో కూలీ కొరతను అధిగమిస్తున్నారు. ప్రభుత్వం కూడా రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తే.. వ్యవసాయం నిజంగా పండుగగా మారుతుందని అంటున్నారు ఉత్తమ రైతు అవార్డు గ్రహీత పల్‌రెడ్డి రాంరెడ్డి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

**తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు జిల్లాలో వ్యవసాయ రంగం ఎలా ఉంది?**




తెలంగాణ రాకముందు ముందు తీవ్రమైన కరువు పరిస్థితులు ఉండేది. విద్యుత్ సరఫరా కూడా సక్రమంగా ఉండేది కాదు. సాగునీటి వనరులు తక్కువగా ఉండడం వల్ల సాగు కూడా చాలా తక్కువగానే ఉండేది. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా 1 లక్ష ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేసేవారు. వర్షాధారంగా పత్తి 3 లక్షల ఎకరాల్లో వేసేవారు. అప్పుడు కేవలం 2లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం, 2.4 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చేది. ఇప్పుడు వరి 5 లక్షల ఎకరాల్లో, పత్తి 6 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. 12 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం, 4.8లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తోంది.

**పంటలను అమ్ముకోవడానికి ఎదురవుతున్న ఇబ్బందులు ఏమిటి?**

అప్పట్లో వ్యవసాయ మార్కెట్‌లు, రైస్‌మిల్లుల్లో ధాన్యం అమ్ముకునే వారు. పత్తి మాత్రం గ్రామాల్లోనే దళారులకు కొనుగోలు చేసేవారు. వారు ప్రభుత్వ మద్దతు ధరలను చెల్లించే వారు కాదు. ఇప్పుడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నా.. తేమ ఉందన్న సాకుతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. దీని కారణంగా రైతులు మిల్లులకు పోతున్నారు. పంటలకు ప్రభుత్వం మద్దతు ధరలు ఉన్నప్పటికీ.. పెట్టుబడులు కూడా పెరిగాయి. దీనివల్ల ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర ఏమాత్రం సరిపోవడం లేదు. మద్దతు ధరను శాస్త్రీయంగా నిర్ణయించాల్సి అవసరం ఉంది. అప్పుడే రైతులు సంతోషంగా వ్యవసాయం చేస్తారు.

**ప్రస్తుతం సాగు విస్తీర్ణం పెరగడానికి గల కారణాలు ఏమిటి?**

సాగునీటి వనరులు పెరగడం, మిషన్ కాకతీయ వల్ల చెరువులో నీరు ఉండడం, వర్షాలు సమృద్ధిగా కురవడం, విద్యుత్ కోతలు లేకపోవడం వల్ల జిల్లాలో ప్రస్తుతం సాగు విస్తీర్ణం పెరిగింది. ఇక, బత్తాయి తోటలు తెగుళ్లసోకి ఎండిపోవడం వల్ల రైతులు వాటిని తీసేసి వరి, పత్తి సాగు చేస్తున్నారు.

**రైతులకు వ్యవసాయం గిట్టుబాటు అవుతుందా?**

జిల్లాలో సాగు విస్తీర్ణం పెరిగింది. కానీ వ్యవసాయం చేయడం వల్ల రైతుకు ఎలాంటి లాభాలు రావడం లేదు. దీనికి కారణం సాగు పెట్టుబడులు భారీగా పెరిగాయి. కానీ అదేస్థాయిలో పంటల ధరలు పెరగలేదు. దీంతో పెట్టుబడులు ఎక్కువై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**పంటలకు బీమా పరిస్థితి ఏమిటి?**

తప్పని సరిగా పంటలకు బీమా చేయాల్సిన అవసరం ఉంది. ప్రైవేట్ సంస్థలతో కాకుండా వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వమే పంటలకు బీమాను చేయాలి. బీమా ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లించాలి. రైతువారిగా, పంట వారిగా బీమాను అమలు చేయాల్సిన అవసరం ఉంది. బీమా ప్రభుత్వ ఆదీనంలో ఉండాలి.

**ప్రభుత్వం రైతుల కోసం ఏం చేయాలని కోరుతున్నారు?**

రైతులు పండించిన దిగుబడులకు శాస్త్రీయ పద్ధతిలో లెక్కలు వేసి గిట్టుబాటు ధర కల్పించాలి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులపై ఉక్కుపాదం మోపాలి. సన్నకారు, చిన్నకారు రైతుల ప్రయోజనాలు కల్పించేలా నిర్ణయాలు ఉండాలి. రైతులకు డ్రిప్, స్ప్రింకర్లు, ఇతర యాంత్రీకరణ పరికరాలను సబ్సిడీ మీద అందించాలి. ఈ పథకాలన్నీ గతంలో ఉన్నాయి.. వాటిని పునరుద్ధరించాలి. ఇలా చేస్తే వ్యవసాయం పండుగ అవుతుంది.

## క్లుప్తంగా

### గూడ్స్ రైలు ఢీకొని గేదె మృతి



గూడ్స్ రైలు ఢీకొని మృతిచెందిన గేదె

మఠంపల్లి: మఠంపల్లి సమీపంలోని రైలు పట్టాలపై సోమవారం గూడ్స్ రైలు ఢీకొని ఒక గేదె మృతిచెందగా.. మరో గేదె తీవ్రంగా గాయపడింది. వివరాలు.. మఠంపల్లి వాసి ఆకుల రాముకు చెందిన పాడి గేదెలు సోమవారం తన వ్యవసాయ పొలం వద్దకు మేత మేస్తూ సమీపంలో రైలు పట్టాల పైకి వెళ్లాయి. అదే సమయంలో జాన్‌పహాడ్ నుంచి జగ్గయ్యపేటకు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొని ఒక గేదె అక్కడికక్కడే మృతిచెందగా.. మరో గేదె తీవ్రంగా గాయపడింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

### విద్యుదాఘాతంతో..

చిలుకూరు: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన సోమవారం చిలుకూరు మండల కేంద్రం పరిధిలో జరిగింది. వివరాలు.. చిలుకూరు మండల కేంద్రం వాసి గండు లక్ష్మయ్యకు చెందిన పాడి గేదె మేత కోసం సమీపంలోని పొలాల్లోకి వెళ్లగా.. అంతకుముందు రోజు రాత్రి వీచిన గాలులకు తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి గేదె అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

### అనారోగ్యంతో వ్యక్తి బలవన్మరణం



భిక్షం (ఫైల్)

పెన్‌పహాడ్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలంలోని ధర్మాపురం గ్రామంలో సోమవారం జరిగింది. వివరాలు.. ధర్మాపురం గ్రామానికి చెందిన తాడూరి భిక్షం (54) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన అతడు సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

### షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసె ఎదుట బాధితురాలు

త్రిపురారం: షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన ఘటన త్రిపురారం మండలంలోని కామారెడ్డిగూడెంలో సోమవారం జరిగింది. త్రిపురారం ఆర్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డిగూడేనికి చెందిన బూర రామచంద్రమ్మ గుడిసెలో నివాసం ఉంటుంది. సోమవారం ఉదయం 11గంటల సమయంలో ఆమె ఉంటున్న గుడిసెకు నిప్పంటుకొని దగ్ధమైంది. గుడిసెలో కరెంట్ కోసం ఏర్పాటు చేసుకున్న విద్యుత్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కావడం వల్ల నిప్పురవ్వలు ఎగిసి మంటలు అంటుకున్నట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గుడిసెలో కాలిపోయిన వస్తువుల విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని పంచనామా నిర్వహించామన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంటోంది.

### మానసిక వికలాంగురాలిపై అత్యాచారం

నేరేడుచర్ల: మానసిక వికలాంగురాలిపై అత్యాచారం చేసిన ఘటన నేరేడుచర్ల మండలం లాల్ లక్ష్మీపురంలో వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. లాల్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన మానసిక వికలాంగురాలిపై అదే గ్రామానికి ఇద్దరు వ్యక్తులు ఆదివారం రాత్రి అత్యాచారానికి పాల్పడ్డారు. సోమవారం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# తండ్రే హంతకుడు..

- తన కుమారుడిని తానే హత్య చేసినట్లు ఒప్పుకున్న నిందితుడు
- భార్యాభర్తల మధ్య విభేదాలు, వరకట్నం డబ్బులు ఇవ్వడం లేదనే కారణంతో ఘాతుకం
- నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్



భార్యాపిల్లలతో భిక్షం (ఫైల్)

అర్వపల్లి: భార్యతో విభేదాలు.. వివాహ సమయంలో ఒప్పుకున్న వరకట్నం డబ్బులు ఇంకా ఇవ్వకపోవడంతో తన కుమారుడిని తానే హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరికి చెందిన రావుల భిక్షం గత ఏడాది కాలంగా తన అత్తగారి ఊరైన జాజిరెడ్డిగూడెంలో భార్యాపిల్లలతో కలిసి ఓ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. భిక్షం టైల్స్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో పాటు భిక్షం మద్యం సేవించి వచ్చి భార్య కరుణను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. వివాహ సమయంలో ఒప్పుకున్న వరకట్నం తాలూకు మరికొన్ని డబ్బులు ఇవ్వాల్సి ఉండగా అత్తింటివారు ఇవ్వడం లేదనే కోపంతో భార్యను తరచూ వేధిస్తున్నాడు. గత నెల 20న కరుణ కిరాణం దుకాణానికి సరుకుల కోసం వెళ్లగా.. భిక్షం తన కుమారుడు అద్విక్‌తేజస్(5)ను నిద్రిస్తున్న సమయంలో గుండెపై గట్టిగా గుద్ది ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడు. ఇంటికి తిరిగివచ్చిన కరుణ అపస్మారకస్థితిలో ఉన్న అద్విక్‌తేజస్‌ను చూసి వెంటనే వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో సాధారణ మరణంగా భావించి అదేరోజు జాజిరెడ్డిగూడెంలో అద్విక్‌తేజస్ అంత్యక్రియలు నిర్వహించారు. కొన్నిరోజులకు కరుణ ఇల్లు సర్దుతుండగా ఇంట్లోని అద్విక్‌తేజస్ షర్ట్‌కు రక్తపు మరకలు కనిపించడంతో ఆమె గత నెల 29న వెంటనే అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన కుమారుడిని తన భర్తే హత్య చేశాడని ఆరోపించింది. దీంతో పోలీసులు తహసీల్దార్ సమక్షంలో ఖననం చేసిన బాలుడి మృతదేహాన్ని 11 రోజుల తర్వాత బయటకు తీయించి సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డాక్టర్‌తో పోస్టుమార్టం నిర్వహించారు. ఆ తర్వాత పోలీసులు భిక్షంను సోమవారం జాజిరెడ్డిగూడెంలో అదుపులోకి తీసుకొని విచారించగా.. తన కుమారుడిని తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు స్థానిక ఎస్‌ఐ ఎస్‌కె. యాకూబ్ తెలిపారు. నిందితుడు భిక్షంను తుంగతుర్తి కోర్టులో సోమవారం రాత్రి రిమాండ్ చేశారు. భిక్షం, కరుణ దంపతులకు ఒక కుమార్తె కూడా ఉంది.

# పాలిసెట్‌లో ‘జయ’ కేతనం

- రాష్ట్రస్థాయిలో 1, 2 ర్యాంకులు సాధించిన జయ పాఠశాల విద్యార్థులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

సూర్యాపేట టౌన్: తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్)2024లో తమ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సోమవారం పాఠశాలలో అభినందించి మాట్లాడారు. పాఠశాలకు చెందిన జి.శ్రీనిక ఎంబైపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంకు, ఎంపీసీ విభాగంలో రాష్ట్ర 3వ ర్యాంకు సాధించిందని పేర్కొన్నారు. అలాగే ఎస్.అషువర్ధన్‌రెడ్డి ఎంబైపీసీ విభాగంలో రాష్ట్ర 2వ ర్యాంకు, ఎంపీసీ విభాగంలో రాష్ట్ర 8వ ర్యాంకు, ఆర్.మోక్షజ్ఞ ఎంబైపీసీ విభాగంలో రాష్ట్ర 17వ ర్యాంకు, ఎంపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 56వ ర్యాంకు, ఎస్‌కె.నేహ ఎంబైపీసీ విభాగంలో రాష్ట్ర 49వ ర్యాంకు, ఎంపీసీ విభాగంలో రాష్ట్ర 19వ ర్యాంకు సాధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ర్యాంకులు సాధించిన నల్లగొండ విద్యార్థులు



విశ్వేశ్వర్‌కుమార్

రామగిరి(నల్లగొండ): పాలిసెట్ -2024 ఎంట్రెన్స్ ఫలితాల్లో నల్లగొండ జిల్లా కేంద్రంలోని బోయవాడకు చెందిన రుద్ర రామకృష్ణ, సునీత దంపతుల కుమారుడు విశ్వేశ్వర్‌కుమార్ ఎంపీసీ విభాగంలో స్టేట్ 12వ ర్యాంకు సాధించాడు. విశ్వేశ్వర్‌కుమార్ ఒకటి నుంచి పదో తరగతి వరకు నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో చదివాడు.



శ్రీచరణ్‌తేజ

### చల్లా శ్రీచరణ్ తేజకు 37వ ర్యాంకు..

నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన చల్లా శ్రీచరణ్‌తేజ ఎంబైపీసీ విభాగంలో స్టేట్ 37వ ర్యాంకు, ఎంపీసీ విభాగంలో స్టేట్ 48వ ర్యాంకు సాధించాడు. చరణ్‌తేజ నల్లగొండ పట్టణంలోని ఏకలవ్య పాఠశాలలో పదోతరగతి పూర్తిచేశాడు.

### ఆలేరు విద్యార్థికి 18వ ర్యాంకు..



వల్లాల శివాజీ

యాదగిరిగుట్ట : పాలిసెట్ ఎంట్రెన్స్ ఫలితాల్లో ఆలేరు పట్టణానికి చెందిన వల్లాల శివాజీ ఎంపీసీ విభాగంలో 120 మార్కులకు గాను 117 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 19వ ర్యాంక్, ఎంబైపీసీ విభాగంలో 120 మార్కులకు గాను 116 మార్కులు పొంది 18వ ర్యాంక్ సాధించాడు. శివాజీ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్‌లో గల విజయరత్న పాఠశాలలో పదోతరగతి పూర్తిచేశాడు.

# లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

- క్లీనర్ మృతి.. డ్రైవర్‌కు గాయాలు
- మృతుడి స్వస్థలం ఏపీలోని కృష్ణా జిల్లా కైకలూరు మండలం భంజలపట్నం



దెబ్బతిన్న ట్రావెల్స్ బస్సు ముందుభాగం



కుటుంబరావు మృతదేహం

చిట్యాల: పెట్రోల్ బంక్‌లో నుంచి అకస్మాత్తుగా హైవే పైకి వచ్చిన లారీని వెనుక నుంచి ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రావెల్స్ బస్సు క్లీనర్ మృతిచెందగా.. డ్రైవర్ గాయపడ్డాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా కై కలూరు మండలం భంజలపట్నం గ్రామానికి చెందిన ఆగుసోమల కుటుంబరావు (40) కోమలి ట్రావెల్స్ బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. కాగా కోమలి ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ నుంచి విజయవాడకు 35 మంది ప్రయాణికులతో బయల్దేరింది. సోమవారం తెల్ల వారుజామున నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన గల భారత్ పెట్రోలియం బంక్ వద్దకు చేరుకోగా.. అదే సమయంలో పెట్రోల్ బంక్ నుంచి లారీ(ఏపీ 29 టీఏ 1207) అకస్మాత్తుగా జాతీయ రహదారిపైకి వచ్చింది. దీంతో ట్రావెల్స్ బస్సు డ్రైవర్ లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ట్రావెల్స్ బస్సులోని క్లీనర్ కుటుంబరావుతో పాటు బస్సు డ్రైవర్ మణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అదే ట్రావెల్స్ బస్సులోని మరో డ్రైవర్ నాగేంద్రవరప్రసాద్ చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కుటుంబరావు మృతిచెందాడు. కుటుంబరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్ల గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఆగుసోమల సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చిట్యాల -2 ఎస్‌ఐ లింగయ్య పేర్కొన్నారు.

## భార్యాభర్తలపై దాడి.. ఐదుగురిపై కేసు నమోదు

భువనగిరి క్రైం: భార్యాభర్తలపై దాడిచేసిన ఘటనలో ఐదుగురుపై కేసు నమోదైంది. భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మన్నెవారిపంపు గ్రామంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మేడబోయిన రాము అతని భార్య శ్రావణి తమ ఇంటి ముందు బోనాలు తీస్తున్నారు. ఈ క్రమంలో రాము, శ్రావణిలతో స్థానికులైన బోయిని నర్సింహతోపాటు మరో నలుగురు ఘర్షణ పడి వారిపై దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితురాలు శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## రైల్వే స్టేషన్‌లో మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిళ్లను చూపుతున్న రైల్వే పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో సోమవారం రాత్రి రైల్వే పోలీసులు పట్టుకున్నారు. రైల్వే సీఐ ఏ. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రైల్వే పోలీసులు సోమవారం రాత్రి మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన పార్సిళ్లను పరిశీలించగా అందులో మద్యం బాటిళ్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.45 వేలు ఉంటుందని రైల్వే ఎస్‌ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను ఎక్సైజ్ ఎస్‌ఐ రాఘవేంద్ర గౌడ్‌కు అందజేశామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో రైల్వే ఎస్‌ఐలు కె. సాలకమ్మ, జి. పవన్ కుమార్‌రెడ్డి, కానిస్టేబుళ్లు పి. వెంకన్న, దుర్గయ్య తదితరులు ఉన్నారు.

# రూ.4.30లక్షలు చోరీ.. నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనునాయక్

తుంగతుర్తి: ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో నిందితుడిని పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనునాయక్ మాట్లాడుతూ.. తుంగతుర్తికి చెందిన కల్లూరి సురేష్ ఆదివారం ఉదయం తుంగతుర్తి మండల కేంద్రంలోని నార్లపురం శ్రీనివాస్ ఇంట్లోకి ప్రవేశించి తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లాడు. కిచెన్‌లో ఉన్న బీరువాను ఇనుప రాడ్డుతో పగులగొట్టి అందులో ఉన్న రూ.4.30లక్షలు దొంగిలించాడు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సూర్యాపేట ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఏడుకొండలు ముందుగా దొంగతనం జరిగిన ఇంటి వద్ద రోడ్డుపై ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి కల్లూరి సురేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా తానే నేరం చేసినట్లు అంగీకరించాడు. దొంగిలించిన డబ్బుతో రూ.28వేల విలువగల సెల్‌ఫోన్ కొన్నట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుంచి రూ.4లక్షలతో పాటు అతడు ఉపయోగించిన మోటార్ సైకిల్, ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడు ఆర్థిక సమస్యలతో పాటు వ్యసనాలకు బానిసై దొంగతనానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసిన తుంగతుర్తి, మద్దిరాల ఎస్‌ఐలు ఏడుకొండలు, మధునాయుడు, ఏఎస్‌ఐ భగవాన్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, కానిస్టేబుల్ సతీష్, విజయ్ కుమార్, రైటర్స్ లింగరాజు, నరేష్, హోంగార్డు రవి, వెంకన్నలను సీఐ అభినందించారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కోదాడరూరల్: మద్యానికి బానిసైన వ్యక్తి కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కోదాడ పట్టణంలోని నయానగర్‌లో సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం కొక్కిరేణి గ్రామానికి చెందిన జి. రవి(36) ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి కోదాడ పట్టణంలోని నయానగర్‌లో నివాసముంటున్నాడు. మద్యానికి బానిసైన రవికి, అతడి భార్య భువనేశ్వరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో ఆమె నాలుగు రోజుల కిందట పుట్టింటికి వెళ్లింది. ఆదివారం రాత్రి నుంచి భార్యకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఆమె స్పందించకపోవడంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రవి భార్య సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా అతడు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాము తెలిపారు.

### ఒడిశా రాష్ట్రానికి చెందిన కూలీ..

మోత్కూరు: ఒడిశా రాష్ట్రానికి చెందిన కూలీ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మోత్కూరు మండలం దత్తప్పగూడెం వద్ద గల వీడీబీ కంపెనీకి చెందిన శిబిరంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు.. ఒడిశాలోని కోరాపూర్ జిల్లా తూబా గ్రామానికి చెందిన దేస్తి మధు(26) గత ఏడాది కాలంగా నేషనల్ హైవే 930కు సంబంధించిన రోడ్డు నిర్మాణంలో పని చేస్తున్నాడు. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టిన వీడీబీ కంపెనీ దత్తప్పగూడెం సమీపంలో ఏర్పాటు చేసిన కూలీల శిబిరంలో అతడు ఉంటున్నాడు. అయితే ఆదివారం రాత్రి మధుల శిబిరంలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా అనంతరం మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కంపెనీ సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కుటుంబ సమస్యల కారణంగానే మృతుడు ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు పేర్కొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కోదాడరూరల్: కోదాడ పట్టణంలోని అరుణ ఆస్పత్రి సమీపంలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మున్సిపాలిటీ సిబ్బంది పట్టణంలోని అరుణ ఆస్పత్రి పక్కన చెత్తను సేకరిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 40 నుంచి 45ఏళ్లు ఉంటాయని, నలుపు రంగులో ఉన్నాడని పోలీసులు తెలిపారు. భిక్షాటన చేసే వ్యక్తి అయ్యి ఉండవచ్చిన పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# యాదగిరిగుట్టకు చేరిన సౌమ్య మృతదేహం

- స్వగ్రామంలో పూర్తయిన అంత్యక్రియలు



సౌమ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట: మే 27వ తేదీన అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గుడ్ల సౌమ్య మృతదేహం సోమవారం ఉదయం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని యాదగిరిపల్లికి చేరుకుంది. ఆ వెంటనే అంత్యక్రియలు నిర్వహించారు. ఉన్నత చదువుల కోసం అమెరికాలోని ఫ్లోరిడాకు వెళ్లిన సౌమ్య ఆరు నెలల క్రితం ఎంఎస్ పూర్తి చేసుకొని, ప్రస్తుతం శిక్షణ తీసుకుంటుంది. కురగాయలు కొనుగోలు చేసేందుకు అక్కడ ఉన్న మార్ట్‌లోకి వెళ్తున్న సందర్భంగా గత నెల 27న కారు ఢీకొట్టడంతో సౌమ్య అక్కడికక్కడే మృతిచెందింది. సౌమ్య మృతదేహం సోమవారం యాదగిరిపల్లికి చేరుకోగానే కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. ఉదయం 4.30 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక వాహనంలో యాదగిరిపల్లికి తండ్రి కోటేశ్వర్, ఇతర కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకువచ్చారు. అనంతరం గ్రామంలోనే అంత్యక్రియలు పూర్తి చేశారు.

### పలువురు నివాళి

సౌమ్య మృతదేహాన్ని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, నాయకులు కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ తదితరులు నివాళ్లు అర్పించారు.

# సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఏసీబీ దాడులు

- ఖాళీ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసేందుకు లంచం డిమాండ్ చేసిన సబ్ రిజిస్ట్రార్
- ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లతో మధ్యవర్తిత్వం
- రూ.99,200 తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు



ఏసీబీ అధికారుల దాడిలో పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్లు

సూర్యాపేట: సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. సబ్ రిజిస్ట్రార్ బానోతు సురేందర్ నాయక్‌పై కొంతకాలంగా వరుసగా ఫిర్యాదులు రావడంతో ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చందర్, నల్లగొండ ఏసీబీ రేంజ్ సిబ్బంది పక్కా ఆధారాలతో వలపన్ని పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట పట్టణానికి చెందిన ఎం. వెంకటేశ్వర్లు తన కుమార్తె మేక మానస పేరు మీద 1,080 చదరపు గజాల విస్తీర్ణంలో ఓపెన్ ప్లాట్‌ను గిఫ్ట్ డీడ్‌గా, మరో 160 చదరపు గజాలు సేల్ డీడ్‌గా మేడిపల్లి రవిరాజుకు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా.. సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ సురేందర్‌నాయక్ గజానికి రూ.100 చొప్పున లక్ష రూపాయలు పైగా ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తానని డాక్యుమెంట్ రైటర్లు కల్లూరి శ్రీనివాస్, తంగెళ్ల వెంకట్‌రెడ్డిల ద్వారా వెంకటేశ్వర్లుకు చెప్పాడు. నాలుగు నెలలుగా రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బంది పెట్టడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు రెక్కీ నిర్వహించిన ఏసీబీ అధికారులు రూ.99,200 లంచం డాక్యుమెంట్ రైటర్లు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి తమ ఆఫీస్‌లో తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం వారిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకెళ్లి సబ్ రిజిస్ట్రార్ సురేందర్ నాయక్‌ను విచారించారు. దీనిలో సబ్ రిజిస్ట్రార్ పాత్ర ఉన్నట్లు తేలడంతో.. ఆయనతో పాటు ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లను అరెస్ట్ చేసి రిమాండ్ చేయనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ సురేందర్‌నాయక్ ఇప్పటికే రెండుసార్లు 2007లో పరిగి, 2018లో మల్కాజ్‌గిరిలో ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.

## మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లిలోని శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన , నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. విష్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఊరేగించారు. క్షేత్రంలోని శివాలయంలోగల శ్రీపార్వతీరామలింగేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ, అర్చకులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



# విత్తనాల వినియోగంపై అపోహలు వద్దు

- ఐసీఏఆర్-ఏటీఏఆర్ఐ, హైదరాబాద్ డైరెక్టర్ షేక్ ఎన్ మీరా, పీజేటీఎస్ఏయూ ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ డాక్టర్ సుధారాణి



మాట్లాడుతున్న ఐసీఏఆర్-ఏటీఏఆర్ఐ, హైదరాబాద్ డైరెక్టర్ షేక్ ఎన్ మీరా



డ్రోన్ ద్వారా పురుగుమందుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న షేక్ ఎన్ మీరా, శాస్త్రవేత్తలు

త్రిపురారం: ఒకే కంపెనీకి చెందిన విత్తనాలు అధిక దిగుబడులు ఇస్తాయని రైతులు అపోహ పడుతున్నారని, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాల మేరకు విత్తనాలను ఎంపిక చేసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్- అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(ఐసీఏఆర్-ఏటీఏఆర్ఐ), హైదరాబాద్ డైరెక్టర్ షేక్ ఎన్ మీరా, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం(పీజేటీఎస్ఏయూ) ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ డాక్టర్ సుధారాణి అన్నారు. త్రిపురారం మండలం కంపాసాగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్లకు వానాకాలం పంటల ప్రణాళికపై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పంటల సాగులో నూతన సాంకేతిక పద్ధతులతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సరైన సలహాలు, సూచనలు ఇప్పించి అధిక దిగుబడులు సాధించడమే కేవీకేల ప్రధాన లక్ష్యమన్నారు. రైతులు పంట మార్పిడి చేసుకోవడం వల్ల చీడపీడలను అదుపు చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో అపరాలు, నూనె గింజల ఉత్పాదకత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నీటిని పొదుపు చేసుకోవడానికి వరిలో వెదజల్లే పద్ధతికి రూపకల్పన చేస్తున్నామన్నారు. మారుతున్న వాతావరణం, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా రైతులు మారాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని రైతులు సకాలంలో భూసార పరీక్షలు చేయించుకునేందుకు వీలుగా కేవీకే కంపాసాగర్‌లో నూతన మట్టి పరీక్ష ల్యాబ్‌ను ప్రారంభించామన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా జొన్న, కంది, పెసర, మినుము, మొక్కజొన్న సాగు, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం, జీవన, సేంద్రియ ఎరువుల వినియోగం, చేపలు, కోళ్ల పెంపకం, నీటి యాజమాన్యం, నేరుగా విత్తనాలు విత్తుకోవడం, విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరిలో మధ్యకాలిక, స్వల్పకాలిక రకాలు, చీడపీడల నివారణకు పురుగుమందుల పిచికారీ, కలుపు యాజమాన్యం, పచ్చిరొట్ట పైర్లు, అపరాల సాగు, పత్తి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో కలసి కేవీకేలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేవీకే, పాలెం ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి, కేవీకే, కంపాసాగర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ లింగయ్య, కేవీకే గడ్డిపల్లి హెడ్ డాక్టర్ నరేష్, సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్, సస్యరక్షణ శాస్త్రవేత్త రాములమ్మ, విస్తరణ శాస్త్రవేత్త పల్లవి తదితరులు పాల్గొన్నారు.